క్లుప్తంగా

రైతు భరోసా ఎక్కడ బాబు

పులివెందుల రూరల్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు, ప్రజలకు ఇచ్చిన హామీలను చంద్రబాబు తుంగలో తొక్కారని నూరు బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రసూల్ తెలిపారు. గురువారం స్థానిక నూర్ బాషా సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాయలసీమ ప్రాంతంలో వర్షాలు పడక అతివృష్టితో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు ఇవ్వాల్సిన రైతు భరోసా కానీ, ఇన్‌పుట్ సబ్సిడీ కానీ ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. అలాగే విద్యార్థులకు తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్ సర్వీస్ పథకాలను కూడా కూటమి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం స్పందించి రైతులకు ఇవ్వాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీ రైతుల ఖాతాల్లో జమచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు : మైదుకూరు నియోజకవర్గం వనిపెంట గ్రామంలోని మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో తాత్కాలిక ఉపాధ్యాయునులుగా పనిచేయుటకు అర్హులైన మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని కన్వీనర్ రామకృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు ఇంగ్లీషు, ఒకటి సోషియల్, ఒకటి సైన్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అభ్యర్థులు పీజీటీ పీజీ, బీఈడీ, టీజీటీ, పీజీ, బీఈడీ టెట్ క్వాలిఫై అయి ఉండాలని సూచించారు. ఈనెల 21వ తేదీలోపు జమ్మలమడుగు పట్టణంలోని రామిరెడ్డిపల్లె రహదారిలో ఉన్న పాఠశాలలో రెజ్యూమ్‌ను సమర్పించాలని సూచించారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి



మాట్లాడుతున్న మండల స్పెషలాఫీసర్ సన్నన్న

సింహాద్రిపురం : గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నప్పుడు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మండల స్పెషలాఫీసర్ సన్నన్న తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్పెషలాఫీసర్ సన్నన్న బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఈఓపీఆర్డీ పద్మనాభరెడ్డి, పీఆర్ ఏఈ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఏపీఓ మంజునాథ్, ఎంఈఓ శారద, పంచాయతీ సెక్రటరీలు, ఇంజనీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ



పంట కోత ప్రయోగాలపై శిక్షణ ఇస్తున్న ఏఓ నాగలక్ష్మి

పులివెందుల రూరల్ : స్థానిక రైతు సేవా కేంద్రంలో గురువారం పంటకోత ప్రయోగాలపై సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగలక్ష్మి పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇ–క్రాప్ ఈనెల 23 వరకు పొడిగించిందన్నారు. ఇ–క్రాఫ్ నమోదుకు రైతు సేవా కేంద్రంలో రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అలాగే మండలానికి 400 ప్రొద్దుతిరుగుడు మినీ కిట్లు మంజూరయ్యాయని.. అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రానికి వచ్చి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

అన్నా క్యాంటీన్ ప్రారంభం



జమ్మలమడుగులో అన్నా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

పులివెందుల రూరల్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డు గాంధీ సర్కిల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను గురువారం రాత్రి ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవీంద్రనాథ్‌రెడ్డిలు ప్రారంభించి మాట్లాడారు. అనంతరం వారు పేద ప్రజలకు భోజనం వడ్డించారు. అన్న క్యాంటీన్ ప్రారంభించే సమయంలో టీడీపీ కార్యకర్తలు తోపులాట జరగడంతో అన్నా క్యాంటీన్‌కు ఏర్పాటు చేసిన అద్దాలు పగిలిపోయాయి. దీంతో ఓ కార్యకర్త చేతికి తీవ్ర గాయమైంది.

జమ్మలమడుగు రూరల్ : మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ అధ్యక్షతన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, పార్టీ ఇన్‌చార్జి సి.భూపేష్‌రెడ్డిలు గురువారం అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పి.రామలక్షుమ్మ, మున్సిపల్ కమిషనర్ ప్రమోదుకుమార్, డి.బాలమల్లేసు, టీడీపీ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు

ప్రజా దర్బార్‌లో సమస్యల వెల్లువ

పులివెందుల రూరల్ : ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు టీడీపీ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం తన నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహించి సమస్యలను తెలుసుకున్నారు.

విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటులో అలసత్వం

- సబ్‌స్టేషన్ వద్ద పేరుకున్న నిల్వలు
- పట్టించుకోని అధికారులు



సబ్‌స్టేషన్ వద్ద నిరుపయోగంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

కొండాపురం : కూటమి ప్రభుత్వం వచ్చి మూడు నెలలు అయింది. రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఆరునెలల క్రితమే మంజూరయ్యాయి. వాటిని కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం చేస్తోంది.

అప్పటి ప్రభుత్వంలో మండలంలోని 25 నుంచి 30 మంది రైతులకు విద్యుత్ కనెక్షన్లు మంజూరయ్యాయి. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వాటిని ఏర్పాటు చేయడం ఆగిపోయింది. కూటమి ప్రభుత్వంలో నూతన వ్యవసాయ కనెక్షన్ల కోసం అన్నదాతలు విద్యుత్ అధికారుల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. పెంజి అనంతపురం వద్ద విద్యుత్ శాఖ సబ్‌స్టేషన్ కార్యాలయానికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించిన తీగలు, క్లాంపులు, ఇన్సులేటర్లు, ఎర్త్ తీగలతో పాటు ఎర్త్ కడ్డీలను జిల్లా కార్యాలయం నుంచి సరఫరా చేసినట్లు సమచారం. అయితే విద్యుత్ పరికరాలు రాలేదని విద్యుత్ శాఖ అధికారులు అంటున్నారు. రైతుల పొలాల్లో ఏర్పాటు చేసేందకు వచ్చిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు సబ్‌స్టేషన్ వద్ద నిరుపయోగంగా ఉన్నాయి. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం డీడీ చెల్లించిన రైతులు తమ పొలాల్లో బోర్లకు ఎప్పుడు విద్యుత్ కనెక్షన్ అందిస్తారో అని ఎదురు చూడాల్సిన పరిస్థితులు ఎర్పాడ్డాయి. ఏర్పాటు చేయకపోవడంతో పంటలు సాగు చేసుకోలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనీసం అధికారులు విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేస్తే ప్రస్తుత రబీ సీజన్‌లో నీటి తడులు అందిస్తే పంటలు వేసుకునేందుకు అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో విద్యుత్ కనెక్షన్ మంజూరైన రైతులకు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

విద్యుత్ సామగ్రి రాగానే కనెక్షన్ ఇస్తాం



వ్యవసాయ బోరు బావుల వద్ద విద్యుత్ కనెక్షన్ లేక రైతులు ఇబ్బందులు పడుతున్నమాట వాస్తవమే. మంజూరైన రైతులకు విద్యుత్ సామగ్రి రాగానే కనెక్షన్ ఇస్తాం.

– మండల విద్యుత్ ఇన్‌చార్జి ఓబులేసు, కొండాపురం

ప్రజల సమస్యల పరిష్కారం పట్ల శ్రద్ధ చూపండి



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌డీఓ వెంకటపతి

కమలాపురం : ప్రజల సమస్యల పట్ల మున్సిపల్ సిబ్బంది శ్రద్ధ చూపి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కడప ఆర్‌డీఓ, కమలాపురం నగర పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ వెంకటపతి తెలిపారు. గురువారం ఆయన కమలాపురం నగర పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి మాట్లాడారు. పట్టణ పరిధిలో పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలన్నారు. అలాగే టౌన్ ప్లానింగ్, పన్ను వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వారికి ఏ సమస్య ఉన్నా తక్షణం పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం 1వ వార్డు సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది హాజరును పరిశీలించారు. వార్డు పరిధిలో వచ్చిన అర్జీలు, వాటి పరిష్కారం తదితర వాటిపై సిబ్బందితో ఆరా తీశారు. ఇకపై ప్రతి గురువారం కమలాపురం నగర పంచాయతీని విజిట్ చేస్తానని, ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. తహసీల్దార్ శివరామిరెడ్డి, రెవెన్యూ, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయ సేవలకై 15100కు డయల్ చేయండి



రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి బాబాఫక్రుద్దీన్

కమలాపురం : కోర్టు కేసుల్లో ఉన్న కక్షిదారులు న్యాయ సేవలకై 15100కు డయల్ చేసి న్యాయ సేవలు పొందవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి ఆదేశాల మేరకు గురువారం స్థానిక సబ్ జైలును ఆయన సందర్శించి రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. ఏవైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అని జైళ్లలో రెండవ పాన్ ఇండియా ప్రచారం–2024 నిర్వహిస్తున్నామన్నారు. జైళ్లల్లో ఉన్న బాల నేరస్తులను గుర్తించి వారికి అవసరమైన న్యాయ సేవలు అందించడమే ఈ ప్రచార ముఖ్య ఉద్దేశం అన్నారు. పాన్ ఇండియా ప్రచారానికి సంబంధించిన సమాచారం బ్యానర్ల రూపంలో బస్టాండ్, రైల్వేస్టేషన్లు, డీఎస్పీ ఆఫీసులు, లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు, బార్ అసోసియేషన్ హాలు, కోర్టు, జైళ్లలో ఏర్పాటు చేశామన్నారు. ప్యానల్ నాయవాదులు, పారా లీగల్ వాలంటరీలచే కరపత్రాలు పంచుతున్నామన్నారు. న్యాయ సేవలు కావలసిన వారు 15100కే డయల్ చేసి పొందవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ గంగాధర్ పాల్గొన్నారు.

బాల నేరస్తులను గుర్తించి న్యాయం చేయాలి

జమ్మలమడుగు రూరల్ : జైలులో ఉన్న బాల నేరస్తులను గుర్తించి వారికి న్యాయం అందించాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాభాపక్రుద్దీన్ తెలిపారు. గురువారం పట్టణంలోని సబ్‌జైలును రెండవ పాను ఇండియా ప్రచారం ఆయన నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పాన్ ఇండియా ప్రకారం జైల్లో ఉన్న బాల నేరస్తులను గుర్తించి వారికి తగు న్యాయం అందిస్తామన్నారు.

సుడిదోమను నివారించాలి



పొలంబడిని పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : వరి పంటలో ఉన్న సుడిదోమను నివారిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. గురువారం పట్టణ పరిధిలోని మీరాపురంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వరి పంటను పరిశీలించి సుడిదోమ, ఆకునల్లి ఉందని గుర్తించారు. వాటిని నివారిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు. సుడిదోమ నివారణకు పైమెట్రోజైమ్ 0.6 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే ఆకునల్లి నివారణకు 5మి.లీ. డైకోఫాల్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. అనంతరం ఏపీసీఎన్ఎఫ్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మీనామృతం తయారు చేసి తయారీ పై అవగాహన కల్పించారు. వరి పంటకు కంకి దశలో మీనామృతం పిచికారి చేయడం వలన పంట ఎదుగుదల కావడమే కాక దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల ఏఓ సరస్వతి, ఏఈఓ దస్తగిరి, వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

ఆర్కేవ్యాలీలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం



ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో చెత్తా చెదారాలను తొలగిస్తున్న విద్యార్థులు

వేంపల్లె : ఇడుపులపాయలో ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ గోవర్ధన్ తెలిపారు. గురువారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం –11 ఆధ్వర్యంలో విద్యార్థులు క్యాంపస్‌లోని చెత్త చెదారం, పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఈనెల 17 నుంచి అక్టోబర్ 1 వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. గాంధీజీ కలలు కన్న స్వచ్ఛ భారత్ ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, అందుకు అనుగుణంగా కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అలాగే పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత ద్వారా ఆరోగ్యంగా ఉంటామని, అప్పుడే దేశాభివృద్ధికి బీజం వేసినట్లవుతుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి రవికుమార్, అకడమిక్ డీన్ రత్నకుమారి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.మధుసూదన, అధికారి డాక్టర్ విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

మ్యాన్ హోల్‌పై మూత ఏర్పాటు



పులివెందుల రూరల్ : పట్టణంలోని శ్రీకర్ ఫంక్షన్ హాల్ సమీపంలో మ్యాన్‌హోల్ దెబ్బతినడంతో స్థానికులు గుర్తించి ప్రమాదాలు జరగకుండా మ్యాన్ హోల్‌పై టెంకాయ పట్టను అడ్డంగా ఏర్పాటు చేశారు. దీంతో సాక్షి దినపత్రికలో 'ఆదమరిస్తే.. అంతే'అనే వార్త ప్రచురితమైంది. స్పందించిన సంబంధిత అధికారులు మ్యాన్ హోల్‌పై మూత ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు, వాహనదారులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

యోగతో మానసిక ప్రశాంతత



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ

జమ్మలమడుగు : విద్యార్థులు యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత వస్తుందని డిప్యూటీ డీఈఓ కృష్ణప్ప తెలిపారు. గురువారం పట్టణంలోని పతంగేరామన్నరావు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అండర్ 14–17 బాలబాలికలకు యోగ, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు, యోగ అంతే అవసరం అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 చంద్రశేఖర్‌రావు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, పీడీ మురళీ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి



వంటకాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ శ్రీలత

సింహాద్రిపురం : పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారాన్ని అందించాలని సీడీపీఓ శ్రీలత తెలిపారు. గురువారం పోషణ్ అభియాన్‌కార్యక్రమంలో భాగంగా బలపనూరు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార కార్యక్రమాన్ని నిర్వహించారు. బరువు తక్కువగా ఉన్న చిన్నారులకు సరైన పౌష్టికాహారం అందించాలన్నారు. ఎప్పటికప్పుడు పిల్లల బరువు, ఎత్తు చూసి తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. అలాగే గర్భిణిగా ఉన్నప్పుడే మంచి పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. పుట్టిన బిడ్డలకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే తాగించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ వసంత, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగంతో పంట దిగుబడి అంచన



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి రమేష్

లింగాల : పంటకోత ప్రయోగం ఆధారంగా పంట దిగుబడి అంచనా వేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. గురువారం స్థానిక రైతు సేవా కేంద్రంలో సిబ్బందికి ఆయన పంటకోత ప్రయోగంపైన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. వరి పంట గ్రామ ఇన్సూరెన్స్ యూనిట్‌గా, కంది, మినుము, జొన్న, ఉల్లి పంటలు జిల్లా యూనిట్‌గా వీటికి దిగుబడి ఆధారంగా ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. వేరుశనగ, అరటి, చీని, పత్తి పంటలు వాతావరణ అధారితంగా ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. పంట కోత ప్రయోగాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని దిగుబడిని అంచనా వేయాలన్నారు. అలాగే మండలానికి 400 పొద్దుతిరుగుడు మినీ ప్యాకెట్లు మంజూరయ్యాయని.. అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

మండలస్థాయి క్రీడా పోటీలు

ముద్దనూరు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 21, 23 తేదీలలో అండర్–14, అండర్–17 విభాగాలలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయులు రాజబాబు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాల మైదానంలో ఈనెల 21న కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాడ్మింటన్, యోగ, చెస్, 23వ తేదీన అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మండలస్థాయిలో జరిగి ఈ ఎంపికలో పాల్గొనే విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్ తీసుకొనిరావాలని, ఈ పోటీలో ఎంపికైన వారు నియోజకవర్గస్థాయి పోటీలో పాల్గొంటారని, ఇతర వివరాలకు 9985533009 సెల్ నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

జూదరుల అరెస్టు

లింగాల : అంబకపల్లె గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో సంచార జూదశాలలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 8 మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.27,700ల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుకుందాం



రోడ్డుపై చెత్తను శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

జమ్మలమడుగు : మున్సిపాలిటీని స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజలు తమవంతు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. గురువారం పట్టణంలోని తాడిపత్రి రహదారిలో నిర్వహించిన స్వచ్ఛతాహీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా పారిశుద్ధ్య సిబ్బందికి చెత్తను అప్పగించాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ అంతరాయం

పులివెందుల రూరల్ : పట్టణంలోని 33/11 కె.వి. డిగ్రీ కళాశాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో, 11 కె.వి. జయమ్మ కాలనీ ఫీడర్ కింద చెట్ల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటలవరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈఈ జగదీశ్వరరెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని పట్టణ ప్రజలు గమనించి సహకరించాలన్నారు.

మొక్కల పెంపకం సామాజిక బాధ్యత

వేంపల్లె : మొక్కల పెంపకం అందరి సామాజిక బాధ్యత అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.సుష్మా తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటి నీరు పోసి మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా సేవ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘన జీవామృతంతో పంటలలో మంచి దిగుబడులు



ఘన జీవామృతాన్ని తయారు చేస్తున్న మాస్టర్ ట్రైనర్ భాస్కర్‌రెడ్డి

పులివెందుల రూరల్ : ఘన జీవామృతాన్ని పంటలకు వేయడం ద్వారా మంచి దిగుబడులు వస్తాయని మాస్టర్ ట్రైనర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని చంద్రగిరిలో ఆయన రైతు మహమ్మద్‌బాషా పొలంలో ఘన జీవామృతం తయారీ విధానంపై రైతులకు అవగాహన కల్పించి మాట్లాడారు. ఘన జీవామృతం పంటలోని మొక్కకు అందించడం ద్వారా భూమి సారవంతమై మొక్కకు అన్ని రకాల పోషకాలు అంది మంచి దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో సీడీఐ సుభాని, ఐసీఆర్పీ పురవీణ తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలలకే ముదిరిన విభేదాలు

- చక్రాయపేట తెదేపాలో మొదలైన వర్గ పోరు
- మండల ఇన్‌చార్జిని మార్చాలంటున్న కొందరు
- మీడియా సమావేశాలతో బట్టబయలు

సాక్షి నెట్‌వర్క్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే తెలుగుదేశం పార్టీలో కుమ్ములాటలు మొదలయ్యాయి. మండల ఇన్‌చార్జిని మార్చాలని కొందరు ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు వాసు వద్ద మొరపెట్టు కుంటే మార్చొద్దని మరి కొందరు కోరుతున్నారు. దీంతో తెదేపా నేతలు ఇన్‌చార్జి పదవి కోసం పార్టీ పరువు తీస్తున్నారని ఆపార్టీకే చెందిన పలువురు మండి పడుతున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే చౌక దుకాణ డీలర్ల నియామకం నుంచే ఈతతంగం మొదలైంది. వివరాల్లోకి వెళితే చక్రాయపేట మండలానికి టీడీపీ ఇన్‌చార్జిగా తాళ్లపల్లె మహేశ్వరరెడ్డి మూడేళ్లుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మండలంలోని కార్యకర్తలు ఆ యన ఇంటి వద్దకు క్యూ కట్టారు. ముఖ్యంగా చౌక దుకాణ డీలర్ షిప్‌ల కోసం అప్పట్లో ఆయన వద్దకు వచ్చిన వారందరికీ ఆయన సరేనని హామీ ఇచ్చా డు. అయితే గ్రామాల్లోని చోటా నాయకులు తాము చెప్పిన వారినే డీలర్లుగా నియమించాలని మహే శ్వర్‌రెడ్డిపై వత్తిళ్లు తెచ్చారు. ఈ సందర్భంలో గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు కొట్టుకుని చొక్కాలు చించుకోవడం కూడా జరిగింది. ఈతతంగం పూర్తయ్యాక ఇన్‌చార్జి వ్యవహారం తెరపైకి వచ్చింది. మహేశ్వరరెడ్డి పార్టీలో సీనియర్లను, ఓటు బ్యాంకు ఉన్నవారిని పక్కనబెట్టి తనకు తొత్తులుగా ఉంటున్న వారికే ప్రాధాన్యత ఇస్తున్నాడని కొందరు బహిరంగంగా విమర్శలు గుప్పిసస్తూ వచ్చారు. దీంతో మహేశ్వరరెడ్డిని తొలగించి పార్టీ పగ్గాలను తమ చేతిలోకి తెచ్చుకోవాలని మరికొందరు పార్టీ నేతలు పావులు కదుపుతూ వస్తున్నారు. ఇన్‌చార్జి పదవి కోసం చక్రాయపేటకు చెందిన కర్నాటి వారి కుటుంబీకులు, ఎర్రబొమ్మనపల్లె గ్రామానికి చెందిన లోమడ భాస్కర్‌రెడ్డి(ఎల్‌బీఆర్), ఎప్పుడూ కాపు వాళ్లేనా బీసీ కింద తనకు ఇవ్వాలని మహదేవపల్లెకు చెందిన రమేష్‌లు తమ గాడ్‌ఫాదర్‌ల వద్ద తమ బాధను చెప్పుకుంటూ వస్తున్నారు. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పటి నుంచి కార్యకర్తలకు అండగా నిలబడింది మహేశ్వరరెడ్డి కాదా అని ఆయన అనుచరులు అంటున్నారు.

వీరంతా బీటెక్ వర్గీయులే

పులివెందుల నియోజకవర్గంలో బీటెక్ రవి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డిల మధ్య కూడా ఆధిపత్య పోరు నడుస్తోంది. ఎక్కువగా బీటెక్ వర్గంలో వర్గ పోరు తీవ్రరూపం దాల్చింది. రామగోపాల్‌రెడ్డి వర్గం చాపకింద నీరులా తమ పనులు తాము చేసుకుంటూ వెళుతోంది. చక్రాయపేట మండలంలో బీటెక్ రవి, రామగోపాల్‌రెడ్డి వర్గాలు ఉన్నప్పటికీ ప్రస్తుతం బీటెక్ వర్గీయులే తెరపైకి వచ్చారు.

కొనసాగుతున్న నర్సుల నిరసన



నిరసన తెలుపుతున్న నర్సులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని వైఎస్సార్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పనిచేస్తున్న నర్సులు నాలుగోవ రోజు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ తమ న్యాయమైన హక్కుల కోసం ధర్నా చేస్తున్నామన్నారు. జీఓ 115ను రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఆసుపత్రిలో పనిచేసే ఏఎన్ఎంలకు మేము వ్యతిరేకం కాదన్నారు. నర్సింగ్ అధికారుల హక్కులను కాపాడాలన్నారు. కాంట్రాక్టు స్టాఫ్ నర్సులందరిని రెగ్యులర్ చేయాలన్నారు. వీరికి ఎన్‌జీఓ సంఘ అధ్యక్షుడు జగన్నాథరెడ్డి మద్దతు తెలిపారు.

హెచ్ఐవీపై అవగాహన కలిగి వుండాలి



ఎయిడ్స్‌పై నిర్వహించిన అవగాహన ర్యాలీ

వల్లూరు : ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ గురించి అవగాహన కలిగి వుండాల్సిన అవసరం వుందని చైల్డ్ ఫండ్ ఇండియా క్లస్టర్ లింక్ వర్కర్ బేబీ తెలిపారు. చిన్ననాగిరెడ్డిపల్లెలో గురువారం చైల్డ్ ఫండ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో మీకు తెలుసా ప్రచార కార్యక్రమంలో భాగంగా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం ర్యాలీ నిర్వహించారు. హెచ్ఐవీ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి అవగాహన కల్పించారు. సోకిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జాస్మిన్, ఆశా వర్కర్ వాణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనకు కృషి చేయాలి



ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ యోగాంజనేయులు

వేంపల్లె : వాతావరణ కాలుష్యాన్ని పెంచే ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనకు కృషి చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యోగాంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి వాటిని తొలగించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ చైనా దేశంలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కువ ఉన్నప్పటికీ రీసైక్లింగ్ ద్వారా నియంత్రిస్తున్నట్లు తెలిపారు. వీటిని నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేంద్ర, నోడల్ అధికారి డాక్టర్ శ్రీకాంత్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పరామర్శ

వీరపునాయునిపల్లె : మండలంలోని బుసిరెడ్డిపల్లె సర్పంచు లింగారెడ్డి అనూరాధ, మాజీ మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి కుమార్తె లింగారెడ్డి దీప్తిని గురువారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధక్షుడు కమలాపురం మాజీ ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. భైరవ ట్రాన్స్‌పోర్ట్ అధినేత మహేంద్రారెడ్డి, ఎస్సీ కార్పరేషన్ మాజీ చైర్మన్ సునీల్‌కుమార్‌లు పాల్గొన్నారు.